# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

DECEMBER-2018

సంవత్సర సభ్యత్వము రూ॥ 50/-

# టి.వి. ద్వారా క్రీస్తు సంఘముల సువార్త పరిచర్యలు

## సత్యవాణి

| | | |
|---|---|---|
| ఆదివారం సాయంత్రం | : | 6.00 గంటలకు శుభవార్త |
| బుధవారం సాయంత్రం | : | 6.30 గంటలకు రక్షణ |
| గురువారం మధ్యాహ్నం | : | 2.30 గంటలకు రక్షణ |
| ప్రతిరోజు ఉదయం | : | 7.30 ని॥ కాంతి ఛానల్‌లో |
| ప్రతిరోజు మధ్యాహ్నం | : | 3.30 ని॥ కాంతి ఛానల్‌లో |
| ప్రసంగీకులు | : | జాషువా గూటం |
| | | రిక్కీ గూటం |
| | | రోనీ గూటం |

Youtube లో satyavanicoc.kkd లో

పై కార్యక్రమములను చూడండి

మీ బంధుమిత్రులను కూడా ప్రోత్సహించండి.

ఉచిత బైబిలు కోర్సు కొరకు మాకు ఈరోజే వ్రాయండి

**SATYA VANI**

P.O.BOX. 80, KAKINADA

PIN : 533004. Ph : 0884 - 2363722

98489 98547, www.satyavanicoc.com

# సత్యవాక్కు

THE WORD OF TRUTH

P.O. Box - 80, Kakinada, A.P. 533 001.

Ph : 0884-2363722 Cell : 98489 98547

Editor

JOSHUA GOOTAM

Pleading for Restoration of First Century Christianity

సంపుటి - 40 డిశంబరు- 2018 సంచిక -5


## యేసు ఎవరు?

**( Who is Jesus )**

**పరిచయము :**

దిగువనుదహరించిన లేఖన భాగములో యేసు తున్నుగూర్చి ప్రజలే మనుకొనుచున్నారని అడిగారు.

"యేసు ఫిలిప్పుదైన కైసర ప్రాంతమునకు వచ్చి మనుష్య కుమారు డెవడని జనులు చెప్పుకొనుచున్నారని తన శిష్యులనడుగగా వారు కొందరు బాప్తిస్మమిచ్చు యోహాననియు, కొందరు ఏలియా అనియు కొందరు యిర్మియా అనియు లేక ప్రవక్తలలో ఒకడనియు చెప్పుకొనుచున్నారనిరి. అందుకాయన మీరైతే నేను ఎవడనని చెప్పుకొనుచున్నారని వారినడిగెను. అందుకు సీమోను పేతురు – నీవు సజీవుడగుదేవుని కుమారుడవైన క్రీస్తువని చెప్పెను. అందుకు యేసు – సీమోను బర్‌యోనా నీవు ధన్యుడవు, పరలోకమందున్న నా తండ్రి ఈ సంగతి నీకు బయలుపరచెనే కాని నరులు నీకు బయలుపరచలేదు" అనెను (మత్తయి 16:13–16).

ఫిలిప్పుదైన కైసరయప్రాంతము విగ్రహారాధనతో నిండియుండెను. వారి విగ్రహములు రాతితోను, చెక్కతోను చేయబడియుండెను. గాని యేసు సజీవుడగు దేవుని కుమారుడని పేతురు ఒప్పుకొనెను. ఈ గొప్ప సత్యము పై

ఆధారపడి క్రీస్తు రాజ్యము స్థాపింప బడును. మరియు అది విశ్వవ్యాప్త మగును.

**యేసును గూర్చి లోకము ఏమను కొనెను?**

యేసు హతుడైన బాప్తిస్మమిచ్చు యోహానని కొందరు తలంచారు. హేరోదు కూడ అట్లే తలంచాడు (మత్తయి 14:1,2). మరికొందరు ఆయన ఏలియగాయనియు లేక యిర్మీయా అనియు తలంచారు. అయితే యేసు ఈ మంచివారిలో ఒకడుకాదు, వారు దేవుని సేవకులే అయినను యేసు వారిలో ఒకడు కాదు. యేసు ఒక మంచి బోధకుడని, లేక యూదుల రబ్బీ యనితలస్తారు. మరి కొందరేమో అబద్ధ ప్రవక్తయగు మహ్మద్ యొక్క మార్గము సరాళము చేయువాడని కూడ చెబుతారు.

**అయితే యేసును గూర్చి అపొస్తులు లేమన్నారు?**

"మీరైతే నన్ను గూర్చి యేమను కొనుచున్నారని" యేసు తన శిష్యుల నడిగారు. అందుకు సీమోను పేతురు – నీవు సజీవుడగుదేవుని కుమారుడ వైన క్రీస్తువు" అని చెప్పాడు. అప్పుడు యేసు "సీమోను బర్‌యోనా నీవు ధన్యుడవు. పరలోకమందున్న నాతండ్రి ఈ సంగతినీకు బయలు పరచెనే గాని నరులు నీకు బయలు పరచలేదు. మరియు నీవు పేతురువు, ఈ బండమీద నా సంఘమును కట్టుదును, పాతాళలోక ద్వారములు దాని యెదుట నిలువనేరవని నీతో చెప్పుచున్నా ననెను" (మత్తయి 16:15-18).

**యేసే దేవుడు :**

అపొస్తలులు ముఖ్యముగా ఈ సందర్భములో పేతురు యేసు దేవుడనెను. ఈ గొప్ప సత్యమును తండ్రియే అపొస్తలులకు బయలు పరచెనని యేసు చెప్పారు. యేసు దేవుడని తోమా ప్రకటించాడు (యోహాను 20:28). ఆయన "మహా దేవుడును మన రక్షకుడైన యేసుక్రీస్తని" పౌలు కూడ వక్కాణించాడు (తీతు 2:13). యేసు మానవాళి యొక్క గొప్పదేవుడును, రక్షకుడునని పౌలు గ్రహించాడు. యేసు "నిజమైన దేవుడును, నిత్యజీవమునై యున్నాడని" యోహాను చెప్పాడు (1యోహాను 5:20). యేసు లేకుండా మనకు జీవము లేదు, పరలోక నిరీక్షణ లేదు.

గనుక యేసు దేవుడై యున్నారు. ఆయనే మన రక్షకుడు.

"మీరు తెలిసికొని నన్ను నమ్మి నేనే ఆయననని గ్రహించునట్లు మీరును, నేను ఏర్పరచుకొనిన నా సేవకుడును మీకు సాక్షులు, నాకు ముందుగా ఏ దేవుడును లేడు. నా తరువాత ఏ దేవుడును ఉండడు, నేను నేనే యెహోవాను, నేను తప్ప వేరొక రక్షకుడు లేడు" (యెషయా 43:10,11).

**యేసు తన సంఘనిర్మాణకుడు :**

యేసు తన సంఘమైన రాజ్యమును నిర్మింతునని మత్తయి 16:18లో చెప్పారు. "ఈబండ మీద నా సంఘమును కట్టుదును" అని యేసు చెప్పారు. మరియు పాతాళలోక ద్వారములు దాని యెదుట నిలువనేరవని కూడ ఆయన చెప్పారు. యేసు సజీవుడైన దేవుని కుమారుడు (దేవుడు) అనే గొప్ప సత్యముపై మన ప్రభువు సంఘము విశ్వవ్యాప్తముగా నిర్మించబడును. సంఘ నిర్మాణకుడుగా యేసు తన శరీరమైన సంఘమునకు శిరస్సై యున్నారు. "సంఘము అను శరీరమునకు ఆయనే శిరస్సు; ఆయనకు అన్నిటిలో ప్రాముఖ్యము కలుగు నిమిత్తము ఆయన ఆదియై యుండి మృతులలో నుండి లేచుటలో ఆది సంభూతుడాయెను" (కొలస్స 1:18).

యేసు తన ఆలయమైన సంఘమునకు ప్రధానయాజకుడును, పరిచర్య చేయువాడునై యున్నారు. "మేమువివరించుచున్న సంగతులలోని సారాంశమేమనగా, మనకు అట్టి ప్రధాన యా.కుడు ఒకడున్నాడు. ఆయన పరిశుద్ధాలయమునకు, అనగా మనుష్యుడు గాక ప్రభువే స్థాపించిన నిజమైన గుడారమునకు పరిచారకుడై యుండి పరలోకమందు మహామహుని సింహాసనమునకు కుడి పార్శ్వమున ఆసీనుడాయెను" (హెబ్రీ 8:1,2). యేసు సంఘమునకు సర్వము ఆయనే.

**ఆయనమాటలే ఆత్మీయ అధికార వాక్కులు :**

యేసు దేవుడని పేతురు ఒప్పుకొనిన తరువాత, "పరలోక రాజ్యము యొక్క తాళపుచెవులు నీకిచ్చెదను, నీవు భూలోకమందు దేని బంధింతువో అది పరలోకమందును బంధింపబడును, భూలోకమందు దేనిని విప్పుదువో అది పరలోక

మందును విప్పబడునని అతనితో చెప్పెను. అటు పిమ్మట తాను క్రీస్తునని యెవనితోను చెప్పవద్దని ఆయన తన శిష్యులకు ఖండితముగా ఆజ్ఞాపించెను" (మత్తయి 16:19,20).

ఇంకొక మాటలో ఆయన మాటలే ఆత్మీయ విషయాల్లో అధికార వాక్కులని యేసుచెప్పారు. నీవు భూలోకమందు దేని విప్పుదువో లేక బంధింతువో అది పరలోకమందు విప్పబడును, బంధింపబడునని చెప్పుటలో అతడు పలుకు మాటల యొక్క మూలము దేవుడే. అందుకే పేతురిట్లు వ్రాసాడు. "ఒకడు తన ఊహను బట్టి చెప్పుటవలన లేఖనములో ఏప్రవచనమును పుట్టదని మొదట గ్రహించుకొనవలెను. ఏలయనగా ప్రవచనము ఎప్పుడును మనుష్యుని ఇచ్ఛను బట్టి కలుగలేదు గాని మనుష్యులు పరిశుద్ధాత్మ వలన ప్రేరేపింబడినవారై దేవుని మూలముగ పలికిరి" యని వ్రాసాడు (2 పేతురు 1:20,21). ప్రతిలేఖనము పరిశుద్ధాత్మావేశము వలన కలిగినదని పౌలు తిమోతికి వ్రాసాడు (2తిమో 3:15, 17). ప్రకటన 22:18,19లో యోహాను ఇట్లువ్రాసడు. "ఎవడైనను వీటితో మరి ఏదైనను కలిపిన యెడల ఈగ్రంధములో వ్రాయబడిన తెగుళ్లు దేవుడు వానికి కలుగజేయును. ఎవడైనను ఈ ప్రవచన గ్రంధమందున్న వాక్యములలో ఏదైనను తీసివేసిన యెడల దేవుడు ఈ గ్రంధములో వ్రాయబడిన జీవవృక్షములోను పరిశుద్ధ పట్టణము లోను వానికి పాలు లేకుండా చేయును". గనుక క్రీస్తు వాక్యమే మన జీవితముకు మార్గదర్శియై యున్నది.

**ముగింపు :**

యేసు ఎవరు అను ప్రశ్నకు జవాబును మనము తెలిసి కొన్నాము. యేసు ఆయనకు వేరే అయిన వ్యక్తి అయ్యుండ వచ్చునని లోకము తలంచెను, తలంచును. రెండవదిగా ఆయన దేవుని కుమారుడని అనగా దేవుడని అపొస్తులులు ఒప్పుకొన్నారు. తదుపరి ఆయన తన సంఘమును కట్టుదునన్నారు. తన సంఘమును నిర్మించారు. చివరిగా నేడు క్రీస్తువాక్యమైన క్రొత్తనిబంధనయే మనకు మార్గదర్శియై యున్నది, ఉండాలి.

– డోనాల్డ్ అండర్వుడ్

# యేసుక్రీస్తు జననము

## ( The Birth of Jesus Christ )

**పరిచయము :**

1. బైబిలు సాధారణ చరిత్ర కూడ యేసుక్రీస్తు జననమును గూర్చి సమాచారము మనకు తెలియ జేయును.
2. యేసుక్రీస్తు చారిత్రాత్మక పురుషుడు గనుక మనము చరిత్ర నుంచి కొంత సమాచారము సేకరించ వచ్చును.

ఎ. ఆయన నిజముగా మానవుడు (దేవుడు కూడాను)

బి. ఆయన ఒక ప్రదేశములో వాస్తవముగా జీవించెను.

సి. ఆయన ఒక కాలములో, గుర్తించదగిన సమయములో ఖచ్చితముగా జీవించారు.

డి. యేసుక్రీస్తు అప్పుడు ఇప్పుడు మనుష్యుల జీవితములను ప్రభావితము చేయుచున్నారు.

3. బైబిలును, సాధారణ చరిత్రయును కూడ యేసుక్రీస్తు జననమును గూర్చి చాల పరిమితమైన సమాచారమునే అందించుచున్నవి.

ఎ. క్రైస్తవునికైతే, యేసుక్రీస్తును గూర్చి బైబిలు చెప్పునది నిస్సందేహమైనది.

బి. అయితే సామాన్య చరిత్ర విషయంలో వాస్తవికతను, అవాస్త వికతను వేరుచేయాలి. మరియు ధృఢపరచబడని పారంపర్యమును కూడ మనము వేరుచేయగలగాలి.

**యేసుప్రభువు జననము అసాధారణ మైనది. ఆయన ఒక కన్యకు జన్మిం చెను (యెషయా 7:14).**

ఎ. క్రీస్తు కన్యకు జన్మించెనని, పాత నిబంధన ప్రవచనములు నెరవేరె నని సువార్తల లేఖకులు నిర్ధారించు చున్నారు.

1. మత్తయి 1:18-25 యోసేపుకు దేవుని దూత ప్రత్యక్షమై యెషయా 7:14లో ప్రవచింపబడినట్లు తనకు ప్రధానము చేయబడిన కన్య మరియ గర్భము ద్వారా నెరవేర్చ బడబోవుచున్నట్లు తెలిపెను.
2. లూకా 1:26-28 కన్యయైన మరియకు దేవుని దూత ప్రత్యక్షమై తన గర్భము ద్వారా యెషయా

7:14 నెరవేర్చబడబోవుచున్నట్లు తెలిపెను.

బి. యేసుక్రీస్తు జననము అద్భుతము. అద్భుతముల కంటె మహాద్భుతము.

1. అద్భుతమనగా దేవునిచే జరిగింప బడిన ప్రకృతికతీతమై వివేచింప దగిన ఒక సంఘటన.

2. యేసుక్రీస్తు కన్యగర్భమున ఉద్భ వించడం మిగతావారి జనన విశేషములకు మించిన అద్భుతము (ఉదా:ఇస్సాకు, బాప్తిస్మమిచ్చు యోహానుల జననము. ఆదికా 12:15,17; 21:1-7; లూకా 1:5-25,36).

సి. యేసుక్రీస్తు కన్యక గర్భమున పుట్టుట క్రైస్తవ్యము యొక్క ముఖ్య మూలసూత్రమైయున్నది.

1. యేసుక్రీస్తు కన్యగర్భమున జన్మించుట ఆయన దైవత్వమును గూర్చినట్టిది.

2. దేవుడు మానవుల మధ్య నివసించు టకు ఈ భూమిపై వచ్చుటకు కన్య గర్భమును ఒక సాధనముగా ఉపయోగించెను (యోహాను 1:1-3, 14:; 1తిమో 3:16; హెబ్రీ 2:16,17; ఫిలిప్పీ 2:6-8).

డి. యేసుక్రీస్తు కన్యకకు జన్మించినందు వలన పాపములో పడిపోయిన మానవులను విమోచించుట సాధ్యమాయెను.

1. మానవుల విమోచన చిరకాలము నుండి ప్రవచనముల అంశమై యుండెను (ఆది.కా. 3:15; 49:10; యెషయా 7:14).

2. మానవులను పాపము నుండి రక్షించుటే యేసుక్రీస్తు రాకడ యొక్క ముఖ్యఉద్దేశ్యము (మత్తయి 1:21; లూకా 19:10).

3. యేసుక్రీస్తు ఈలోకరక్షకుడై యున్నారు. ఈ ముఖ్యాంశమును బైబిలు నుండి తొలగిస్తే అది అర్థ రహితమైన గ్రంథమగును.

4. కన్యకకు జన్మించుటవలన పాపములు నిజముగా క్షమించ బడుటకు ఒక పరిపూర్ణ బలిని సిద్ధపరచెను.

5. ఎవడైనా పాపముల నుండి రక్షింప బడవలెనంటే యేసుక్రీస్తు ఒక్కరే ఏకైక రక్షణ మార్గమైయున్నారు (అపో.కా.4:12; రోమా 10:13;

అపో.కా. 2:38).

2. **క్రైస్తవ్యము యొక్క శత్రువులు కన్యకకు జన్మించిన సంఘటనను తక్కువచేతురు. వ్యతిరేకిస్తారు :**

ఎ. క్రీస్తువిరోధులైన నాస్తికులు దేవుడు లేడందురు. లౌకికవాదులు ప్రకృతి కతీతమైన దేవుని కార్యములను కాదందురు.

1. క్రీస్తు విరోధులు బైబిలులోని ప్రతి అద్భుతము కల్పనా కథయని చెప్పుదురు.

2. క్రైస్తవ్య విరోధులు కన్యక జనన మిచ్చుటను, యేసుక్రీస్తు పునరుత్థానమును నిరాకరింతురు.

3. క్రైస్తవ్యవిరోధులు బైబిలు ఒక పురాణమని చెప్పుదురు.

బి. లౌకికవాదులు నిర్దేవులకంటే క్రైస్తవ్యమునకు ఎక్కువ సవాలుగా తయారయ్యారు.

1. ఫ్రాన్సిస్ వోల్టెయిర్, తోమస్ పెయిన్‌లాంటి నాస్తికులు క్రైస్తవ్య వ్యతిరేకులుగా పేరొందినవారు.

2. అయితే లౌకిక వాదులు క్రైస్తవుల మనే పరిగణింపబడును. గాని దానిని కించపరచుదురు.

3. ఈ లౌకిక వాదులు బైబిలును పరోక్షముగా వ్యతిరేకించుట వలన ఎక్కువ ప్రమాదకారకులు, క్రైస్తవ్యమునకు మేము వ్యతిరేకుల మనివారు బహిరంగముగా ఒప్పుకొనరు.

సి. కన్యక జననమిచ్చుట ప్రకృతి విరుద్ధము, అసంభవమని చెప్పుచు లౌకికవాదులు దానిని నిరాకరిస్తారు. క్రైస్తవులు కన్యక జననమిచ్చుటతో సహా బైబిలులోని అన్ని అద్భుతములను విశ్వసిస్తారు. ఏలయనగా దేవునికి అసాధ్యమైన దేదియు లేదు (లూకా 1:37).

డి. యోహాను సువార్త యేసు యొక్క దైవత్వాన్ని గూర్చి చెబుతున్నా యేసు కన్యక గర్భమున బుట్టినట్లు యేమీ చెప్పుటలేదని లౌకిక వాదులు వాదిస్తారు.

1. నిజానికి యేసు యొక్క నరావతార మును గూర్చి చెప్పు ప్రతి లేఖనము ఆయన కన్యక గర్భమున బుట్టి నట్లు చెబుతాది (యోహాను 1:1-3,10,14,15,18).

2. యేసు శరీరావతారమును దైవత్వ

ము ను అపో. యోహాను కలిపి చెబుతాడు.

3. యోహాను 1:14 కన్యక జనన మిచ్చుట సమర్ధించుచున్నది. అది మిగతా సువార్తల రికార్డుతో ఏకీ భవించుచున్నది.

ఇ. క్రీస్తుగాని అపొస్తులులు గాని కన్యక జననమిచ్చుటను గూర్చి ఎన్నడు బోధించలేదని లౌకికవాదులు వాదిస్తారు.

1. రోమా 1:3,4లో దైవత్వములోని ఒక వ్యక్తి మానవావతారియై వచ్చె నని చెప్పుచున్నది. అందులో కన్యక జననమిచ్చుట ఇమిడి యున్నది.

2. అట్లే గలతీ 4:4 శరీరావతార ము ను గూర్చి చెప్పుచున్నది. దానిలో కన్యక జననమిచ్చుట ఇమిడి యున్నది.

ఎఫ్. యోసేపు యేసు యొక్క తండ్రియని లౌకిక వాదులు చెప్పుదురు.

1. యోసేపు యేసు యొక్క తండ్రి యని మరియ చెప్పినదికదా యని వారడుగుదురు (లూకా 2:48).

2. మరియ యోసేపు యేసు యొక్క తండ్రియని యూదులు కూడ భావించారని వారు చెబుదురు (లూకా 2:42; మత్తయి 13:55; లూకా 3:23; 4:22).

3. యోసేపు యేసు యొక్క పెంపుడు తండ్రి, నిజమే గాని యేసు తన పరిచర్య ప్రారంభించి అద్భుతములు చేయుట మొదలిడు వరకు లోకము ఆయన దైవత్వాన్ని గుర్తించలేదు.

జి. ప్రఖ్యాతిగాంచిన పురుషుల జనన గాధల వలే యేసు యొక్క జనన సందర్భము కూడ కట్టుకథలతో కూడి యున్నదని లౌకిక వాదులు చెప్పుదురు.

1. పురాణాల్లో యున్నవారి జనన గాధలవలె యేసు యొక్క జననము కూడ పుక్కిట పురాణమేయని వారందురు.

2. అయితే యేసు యొక్క జననము పాతనిబంధన ప్రవచనములతోను, క్రొత్తనిబంధనలో వాటి నెరవేర్పు తోను ధృఢపరచబడుచున్నది. మరియు ఆయన జననమును గూర్చిన యూదుల ఆకాంక్షతోను,

క్రొత్తనిబంధన క్రైస్తవులాయనను అంగీకరించుటతోను దృఢపరబడు చున్నది.

3. కన్యక జనన మిచ్చుటను గూర్చి క్రైస్తవులు క్రొత్త నిబంధన ఆధారములపై విశ్వసించుదురు.

హెచ్. ఆదిమసంఘము యేసు కన్యకకు జన్మించినట్లు నమ్మలేదని ఆధునిక లౌకిక వాదులు చెప్పుటకు పూను కొందురు.

1. బైబిలులోగాని దానికి బయట గాని దీనిని ధృవీకరించుటకు ఆధారము యేమీలేదు.

2. 18వ శతాబ్ధములో మాత్రమే కన్యక జననమిచ్చుటను శంకించు అబద్ధబోధకులు బయలుదేరారు.

**3. యేసు యొక్క జననము చారిత్రా త్మకమైనది.**

ఎ. యేసు యొక్క జననమును బైబిలు ముందుగానే ప్రవచించినది.

1. మెస్సీయ లేక రక్షకుడు కన్యక గర్భమున ఉద్భవించునని పాత నిబంధన ప్రవచించినది (ఆది 3:15; 12:3; 49:10; యెషయా 7:14).

2. రక్షకుడు జన్మించే స్థలము ముందుగానే ప్రవచింపబడినది. (మీకా 5:2).

3. ప్రవచనము ద్వారా రక్షకుడు జన్మించే కాలము కూడ ప్రవచింప బడినది (దానియేలు 2:31-45).

బి. మెస్సీయ జననమును గూర్చిన ప్రవచనములు నెరవేరినట్లు బైబిలు చరిత్ర ధృవీకరించుచున్నది.

1. యేసు బెత్లేహేములో జన్మించెను (మత్తయి 2:1; లూకా 2:1-7).

2. యేసుకైసరు ఔగుస్తు పాలన కాలములో జన్మించెను. అప్పుడు కురేనియు సిరియదేశమునకు అధిపతిగాను రాజైన హేరోదు పాలస్తీనాను పాలించుచుండెను (లూకా 2:1,2; మత్తయి 2:1).

సి. సామాన్య చరిత్ర కూడ యేసు యొక్క జననమును నిర్ధారించు చున్నది.

1. యేసు జనన రికార్డు ఈ చరిత్ర గ్రంథములలో వ్రాయబడియున్నది.

ఎ. Italy by John C. Abbott (Page 301).

బి. A History of Rome by Arthur E.R. Book (P.334).

సి. World Civilisation by Edward Burns and Philips Ralph (360-363).

2. సామాన్య చరిత్ర క్రైస్తవ్యమునకు అనుకూలముగా యున్నది. అంతే గాకుండా క్రైస్తవ్యవ్యతిరేక చరిత్ర కారులు కూడ నజరేయుడైన యేసు చారిత్రాత్మక పురుషుడని కూడ అంగీకరించారు.

ముగింపు .

1. నజరేయుడైన యేసనబడిన వ్యక్తి పాలస్తీనాలో జన్మించెననునది గొప్ప వాస్తవము.

ఎ. బైబిలు, సామాన్య చరిత్ర కూడ దీనిని ధృవీకరించుచున్నవి.

బి. యేసు యొక్క జననము ప్రశ్నింపతగని వాస్తవము.

2. యేసు ఒక కన్యకు జన్మించెననునది గొప్ప వాస్తవము.

**ఆహ్వానము :**

యేసుక్రీస్తు దేవుని కూమారుడు. కన్య మరియ గర్భము ద్వారా ఆయన ఈ లోకమందు ఉద్భవించారు. ఈ లోకంలో జీవించారు. మరణించి సమాధిచేయబడి తిరిగిలేచారు. ఆయన సువార్త విని విశ్వసించి బాప్తిస్మము పొందిన వారిని ఆయన రక్షించును. **- రష్మోర్**

## యెహోవాకు అసహ్యములైనవి :

# దుర్యోచనలు యోచించు హృదయములు

## (A Heart that Deviseth Wicked Imaginations)

హృదయమనగా యేమిటి? మానవుని యొక్క నైతిక మానసిక చర్యలను కౌగలించుకొను స్థావరము అది. దానిలో మన మనస్సు, చిత్తము, నైతిక వర్తనము ఇమిడియున్నవి. అది మన వివేక విశిష్టమైన భావోద్రేకములను ప్రభావితము చేయు స్థావరము. "నీ హృదయములో నుండి జీవధారలు బయలుదేరును కాబట్టి అన్నిటి కంటే ముఖ్యముగా నీ హృదయమును భద్రముగా కాపాడుకొనుము" అని జ్ఞానియైన సొలొమోను చెప్పాడు (సామెతలు 4:23). మనమేమై యున్నామో యేమి కాగలమో అవి హృదయములో నుండే బయలువెళ్లును. గనుక దుష్టత్వము నుండి మనము

దానిని భద్రముగా కాపాడుకొనవలెను.

**దేవునికి అసహ్యములైన ఏడు సంగతులను ఆయన ప్రకటించారు.** అందులో దుర్యోచనలు యోచించు హృదయమున్నది (సామె 6:18). దురాలోచనలు యోచించుట అనగా వాటిని కల్పించుట, కలుగజేయుట, వాటిని దాచిపెట్టుట. దుర్యోచనలు యోచించుటలో పైకి కనబడకుండా రహస్య ఆలోచనలు చేయుట అందులో యున్నది. హృదయములో కలలుగను రహస్య తలంపులు సాధారణముగా చెడ్డవి. దురాలోచనలు ఒకడు చేయునది మంచి అయినా, చెడు అయినా వాటిని అతడు తన హృదయములో ఆలోచించుకొనును.

మానవుల తలంపులను గూర్చి ఆలోచించునప్పుడు మనము నోవహు కాలము నాటి మనుష్యులను గూర్చి తలంచవచ్చును. వారిని గూర్చి మోషే ఇట్లు వ్రాసాడు : "నరుల చెడుతనము భూమిమీద గొప్పదనియు వారి హృదయము యొక్క తలంపులలోని ఊహ అంతయు ఎల్లప్పుడు కేవలము చెడ్డదనియు యెహోవా చూచి తాను భూమిమీద నరులను చేసినందుకు యెహోవా సంతాపము నొంది తన హృదయములో నొచ్చుకొనెను" (ఆది కా. 6:5,6).

**మానవుని హృదయము యొక్క తలంపులలోని ఊహ అంతయు ఎల్లప్పుడు చెడ్డది.** ఈ దుష్టత్వము వలన నాటి ప్రపంచమును దేవుడు జల ప్రళయము ద్వారా నాశనము చేసారు. దుష్టతలంపులతో నిండియున్న వారు దేవుని తత్వమును అందు విషయమై గ్రహించుకొనగలరు. మనుష్యుని యొక్క ప్రతితలంపును ఊహను దేవుడు ఎరిగియున్నారు.

రాజైన దావీదు తన కుమారుడైన సొలొమోనుకు ఇట్లు చెప్పాడు. "సొలొమోనా, నా కుమారుడా నీ తండ్రి యొక్క దేవుడైన యెహోవా అందరి హృదయములను పరిశోధించువాడును, ఆలోచనలన్నిటిని సంకల్పములన్నిటిని ఎరిగిన వాడునై యున్నాడు. నీవు ఆయనను తెలిసికొని హృదయపూర్వకముగాను, మన:పూర్వకముగాను ఆయనను వెదకిన యెడల ఆయన నీకు ప్రత్యక్షమగును, నీవు ఆయనను విసర్జించిన

యెడల ఆయన నిన్ను నిత్యముగా త్రోసి వేయును" (1దినవృ 28:9).

ప్రతి దుష్టహృదయము వెనుక సాతానుడున్నాడు, గాని వాడు మానవుని వాడుకొనును. దుష్ట హృదయము గల వ్యక్తి ఇతరులను ఎట్లు మోసగింతునా యని ఆలోచించు కొనుచు యుండును. వాని మొదటి ప్లాను వికటిస్తే, అతని కోరిక నెరవేరు టకు మరొక ప్లాను వేసికొనును. దుష్ట సంకల్పముల కొరకు అతని హృదయము ఎల్లవేళలా పనిచేయుచు యుండును. "వాడు మంచము మీదనే పాపయోచనను యోచించును. వాడు కాని నడతలను నడుచువాడు, చెడు తనము వానికి అసహ్యము కాదు" అని దావీదు వ్రాసాడు (కీర్తన 36:4). ప్రవక్తయైన మీకా ఇట్లు చెప్పుచున్నాడు. "మంచముల మీద పరుండి మోసపు క్రియలు యోచించుచు దుష్కార్యములు చేయువారికి శ్రమ, ఆలాగు చేయుట వారిస్వాధీనములో యున్నది. గనుక వారు ప్రొద్దు పొడవగానే చేయుదురు" (మీకా 2:1).

దుష్టులైన వారనేకులు ఈ లోకములో యున్నారు. కీడు కలిగించ డానికి వారు తీరిక లేకుండా యోచిస్తునే ఉంటారు. ప్రపంచ నాశనము కొరకు యేమి చేతుమాయని తలంచుచు వారు నిద్రపోకుండా ఆలోచిస్తూనే ఉంటారు. దేవునిని ఆయన నుండి కలుగు మంచినంతటిని వారు అసహ్యించుకొంటారు. వారను కొనినంత కీడును జరిగించడానికి, కృత నిశ్చయము కలిగి యుంటారు. భ్రూణహత్యలు, ఎబార్షన్లు, స్వలింగ సంపర్కము మొదలగునవి జరిగించుచు కుటుంబ వ్యవస్థను నాశనము చేతురు. ఇట్టిపనులు జరిగించువారు, వాటిని ప్రోత్సహించు వారు "దేవుడు" అను పదమును అసహ్యించుకొంటారు. మనము అట్టి పనులలో జోక్యము కలిగించుకొన కుండునట్లు మన హృదయములను భద్రముగా కాపాడుకొనవలెను.

దుష్టహృదయులైన వారు లోకములో ఎట్లున్నారో అట్లే క్రీస్తు శరీరమైన సంఘములో కూడ దుష్ట హృదయులున్నారు. అట్టివారు కొందరు నాయకత్వస్థానములలో యుండి, క్రీస్తు

యొక్క సంఘము మతశాఖలతో మిళితమై యుండాలని కోరుదురు. వారు బైబిలు యొక్క అధికారమును గౌరవింపరు. డినామినేషన్లతో కలసియుండుటకు వారు సంతోషిస్తారు. దేవుని వాక్యములో బయలుపరచ బడిన నిజైక్యతను వారు ఆస్వాదించరు. వారి దుష్టత్వమును తేనెపూసిన మధుర పలుకలతో కప్పిపుచ్చుదురు. అట్టి వారిని గూర్చి అపొ.పౌలు ఇట్లు హెచ్చరించాడు : "వాక్యమును ప్రకటించుము, సమయమందును అసమయమందును ప్రయాసపడుము; సంపూర్ణమైన దీర్ఘశాంతముతో ఉప దేశించుచు ఖండిచుము గద్దించుము బుద్ధిచెప్పుము. ఎందుకనగా జనులు హితబోధను సహింపక దురద చెవులు గలవారై తన స్వకీయ దురాశలకు అనుకూలమైన బోధకులను తమ కొరకు పోగుచేసికొని సత్యమునకు చెవినియ్యక కల్పనాకథల వైపు తిరుగు కాలము వచ్చును" (2తిమోతి 4:2-4).

అబద్ధములు చెప్పి మనలను మోసపుచ్చువారనేకులు మన మధ్యనే యున్నారు. అట్టివారితో కలసియుండ కుండ మన హృదయమును జాగ్రత్తగా చూచుకొనవలెను. ప్రవక్తయైన యిర్మియా చెప్పిన మాటలను మనము అంగీకరించి నడుచుకోవాలి : "ఆలకించుడి, మీరందరు నా మాట వినకుండ కఠినమైన మీ దుష్ట కాఠిన్యము చొప్పున నడుచుకొను చున్నారు; మీరు మీ పితరుల కంటె విస్తారమైన చెడుతనము చేసి యున్నారు" (యిర్మియా 16:2).

హృదయము నుండియే మేలు గాని కీడు గాని బయలు వెళ్లును. హృదయములోనికి దేనిని పంపుదుమో దానిని బట్టియే దాని నుండి బయలు వెళ్ళునది యుండును. దావీదును ఇందు విషయమై మనము అనుకరించాలి. అతడిట్లు చెప్పాడు : "నా పూర్ణహృదయముతో నిన్ను వెదకి యున్నాను. నన్ను నీ ఆజ్ఞలను విడిచి తిరుగనియ్యకుము. నీ యెదుట నేను పాపము చేయకుండునట్లు నా హృదయములో నీ వాక్యము ఉంచు కొని యున్నాను" (కీర్తన 119: 10,11).

- జానీస్కేగ్స్

# ప్రార్థన యొక్క విశేషాధికారము

## ( The Privilege of Prayer)

ప్రార్ధన ఒక గొప్ప తరుణము. దేవుని యందు నమ్మకముగా యున్న వారికది ఒక వాగ్దానము. దేవుడు తన బిడ్డలను కాపాడుటయేగాక, వారి ప్రార్ధనలను ఆయనవినునని అది నిర్ధారించుచున్నది.

ప్రార్ధన అందరికీ ఇయ్యబడిన నిర్ధారణ కాదు. పాపుల యొక్కయు, తిరుగుబాటుదార్ల యొక్కయు ప్రార్ధనలు వినబడవు అని చెప్పులేఖన భాగముల నేకములున్నవి. వారి ప్రార్ధనలు మేఘములను దాటి వెళ్లవు. అట్టి వారి ప్రార్ధనలు దేవునికి హేయము. ఉప ద్రవములు వచ్చినను దేవుడు వారి ప్రార్ధనలనాలకించడు.

దీనిని అంగీకరించుటకు చాల మంది ఇబ్బంది పడతారు. దేవుడు ప్రేమయైయున్నారు, కదా? గనుక మేము ఎంత దుర్మార్గులమైనను కష్ట కాలములో ఆయన మా మొరలను వింటాడు?కాదా? ఈ ప్రశ్నలకు దేవుని వాక్యమేనే జవాబునీయనిద్దాం.

"నేను పిలువగా మీరు వినక పోతిరి. నా చేయిచాపగా ఎవరును లక్ష్యపెట్టకపోయిరి. నేను చెప్పిన బోధ యేమియు మీరు వినకత్రోసి వేసితిరి, నేను గద్దింపగా లోబడకపోతిరి. కాబట్టి మీకు అపాయము కలుగునప్పుడు నేను నవ్వెదను. మీకు భయము వచ్చు నప్పుడు నేను అపహాస్యము చేసెదను. భయము మీమీదకి తుఫానువలె వచ్చునప్పుడు సుడిగాలివచ్చునట్లు మీకు అపాయము కలుగునప్పుడు, మీకు కష్టమును, దు:ఖమును ప్రాప్తించునప్పుడు నేను అపహాస్యము చేసెదను. అప్పుడువారు నన్ను గూర్చి మొర్రపెట్టెదరు గాని నేను ప్రత్యుత్తర మీయకుందును. నన్ను శ్రద్ధగా వెదకెదరు గాని నేను వారికి కనబడ కుందును. జ్ఞానము వారికి అసహ్యా మాయెను. యెహోవాయందు భయ భక్తులు కలిగి యుండుట వారి కిష్టము లేకపోయెను. నా ఆలోచన విననొల్లక పోయిరి. నా గద్దింపును వారు కేవలము తృణీకరించిరి. కాబట్టి వారు తమ ప్రవర్తనకు తగిన ఫలము అను భవించెదరు. తమకు వెక్కసమగు వరకు తమ ఆలోచనలను

అనుసరింతురు. జ్ఞానములేని వారు దేవుని విసర్జించి నాశనమగుదురు. బుద్ధిహీనులు క్షేమము కలిగినదని మైమరచి నిర్మూలమగుదురు'' (సామెతలు 1:24-33).

యిది దుర్మార్గులకు ఒక హెచ్చరికయైతే, విశ్వాసులకది ఒక వాగ్దానము. విపత్తులు సంభవించునప్పుడు దేవుడు ఆలకించును. ఆయన వినుట మాత్రమే గాక, ఆయన చలించును!

పదే పదే యిది నిరూపించబడెను. నీతిమంతులు తమ ప్రార్థనల ద్వారా విపత్తుల మార్గమును మళ్లింతురు.

- జేక్ కార్టర్

## హన్నా నుండి ఒక పాఠము-1

## ( A Lesson from Hannah )

పాతనిబంధన గ్రంథములో హన్నాయను ఒక భక్తిపరురాలిని గూర్చి మనము చదువగలము. హన్నా యొక్క కధ క్రీ.పూ. 1114 సం॥ల కాలమున ఇశ్రాయేలీయుల కధయైయున్నది. హన్నా తన కుటుంబముతో ఎఫ్రాయిము మన్యమందు రామతయిమ్సోఫీము పట్టణమందు జీవించుచుండెను. ఆ కాలమందు యెరూషలేమునకు ఇంచుమించు 25 మైళ్ళు ఉత్తరముగా యున్న షిలోహులో యెహోవా యొక్క ఆరాధన స్థలముండెడిది.

హన్నా కుమారుడైన సమూయేలు జీవితచరిత్ర నిత్యము మిళితమై యున్నది. ఆమె చాల భక్తి పరురాలు. ఆమె కుమారుడు ఇశ్రాయేలీయులకు ఆఖరి న్యాయాధిపతిగాను మొదటి ప్రవక్తగాను అయ్యెను. అప్పటికి ఇశ్రాయేలీయుల పరిస్థితి ఏమియు బాగుండలేదు. యాజకుడైన ఏలీవృద్ధుడయ్యెను. అతని కుమారులు దౌర్భాగ్యులైరి. ఇశ్రాయేలు చుట్టు విగ్రహారాధన చేయు జనాంగములుండెను.

ఎఫ్రాయిామీయుడైన ఎల్కానా అను నతని ఇద్దరి భార్యలలో హన్నా ఒకతె. రెండవదాని పేరు పెనిన్నా. పెనిన్నాకు పిల్లలు కలిగిరి గాని హన్నాకు పిల్లలు లేకపోయిరి. ఆమె వైరి యగు పెనిన్నా హన్నాకు పిల్లలు లేనందున ఆమెను విసగించుటకై ఆమెకు కోపము పుట్టించుచు వచ్చెను

(1 సమూ 1:2-6).

**హన్నా చాల ఓపికవంతురాలు.** హాగరును శారా పంపించి వేయమని చెప్పిన రీతిగ పెనిన్నాను పంపించి వేయవలసినదని ఆమె తన భర్త నడుగ లేదు. ఆమె భర్తయైన ఎల్కానా ఆమె యెడల ప్రియముగా నుండెను. పది కుమాళ్ళ కంటె విశేషముగా అతడు ఆమె యెడల ప్రవర్తించెను. అట్టి ప్రేమ ఆదరణీయమైనది. యెహోవా యందలి ఆమె విశ్వాసము కూడ బలమైనది, ఆదరణీయమైనది. అయినను ఆమెకు నిజమైన సంతోషము లభింపక పోయెను. గనుక ఆమె యెహోవా మందిరమునకు వెళ్ళునప్పుడెల్ల ఆమె భోజనము చేయక యేడ్చుచువచ్చెను. ఆమెకు సంతానము గలుగనందున ఆమె తన్ను తాను దౌర్భాగ్యురాలుగా యెంచుకొనెను.

హన్నా షిలోహునకు వచ్చి యెహోవా సన్నిధిని బహు దు:ఖ క్రాంతురాలై ప్రార్ధన చేయుచు యేడ్చుచు తనకు మగపిల్లలను దయ చేయుమని సైన్యములకధిపతియగు యెహోవాను వేడుకొనెను. "నీ సేవకు రాలైన నాకు మగపిల్లలను దయచేసిన యెడల వాడు బ్రదుకు దినము లన్నిటిను నేను వానిని యెహోవాకు అప్పగింతునని" ఆమె మ్రొక్కుబడి చేసి కొనెను (1సమూ 1:11).

నిస్వార్ధముగా వేడుకొను వారికి సహాయము చేయుటకు దేవుడు సంతోషించును. యాజకుడైన ఏలీ ఆమెను చూచి, "నీవు క్షేమముగా వెళ్ళుము; ఇశ్రాయేలు దేవునితో నీవు చేసికొనిన మనవిని ఆయన దయ చేయును గాక అని ఆమెతో చెప్పెను" (1:17). గనుక హన్నా తన దారిని వెళ్ళిపోయి భోజనము చేయుచు నాట నుండి దు:ఖముఖిగా నుండుట మానెను. దేవుడు హన్నా ప్రార్ధన నాలకించెను. గనుక ఆమె గర్భము ధరించి దినములు నిండినప్పుడు ఒక కుమారుని కని - నేను యెహోవాకు మ్రొక్కుకొని వీనిని అడిగితి ననుకొని వానికి సమూయేలను పేరు పెట్టెను (1:20). సమూయేలనగా దేవుని అడుగబడిన వాడని యర్ధము. తన తల్లి యొక్క భక్తిని గూర్చియు, ప్రవర్తనను గూర్చియు సమూయేలు యొక్క పేరు అతనికి గుర్తు తెచ్చుచుండెను.

హన్నా అతి నిస్వార్ధహృదయురాలై సమూయేలు ఇంక చిన్నవాడై యుండగా ఆమె ఆ బాలుని ఎత్తుకొని

షిలోహులోని దేవుని మందిరమునకు వచ్చెను (1:24). ఆ బిడ్డను యెహోవా సన్నిధిలో ప్రతిష్ఠించుచు ఆమె "ఈ బిడ్డను దయచేయమని యెహోవాతో నేను చేసిన మనవి విని అయన నా కనుగ్రహించెను; కాబట్టి నేను ఆ బిడ్డను యెహోవాకు ప్రతిష్ఠించుచున్నాను; తాను బ్రతుకు దినములన్నియు వాడు యెహోవాకు ప్రతిష్ఠితుడని చెప్పెను (1:27,28). హన్నా ఈ ఘన కార్యమును చేసినందు వలన సమూయేలు జీవితములో దేవుడే ముందు గాని తల్లి, తండ్రి, బంధువులు కాదని బాల్య వయస్సులోనే నేర్చు కొనెను.

హన్నా ఆడినమాట తప్పనిది. తన కుమారుని నుండి ఎడబాసి యుండుట బహుకష్టమే అయినను, ఆమె దేవునికి చెల్లించిన మ్రొక్కుబడిని తీర్చుకొనెను. అయితే దానివలన ఆమె ఏమేమి పొందెనో ఇప్పుడు గమనించు దము: తన కుమారుడు దేవుని సేవలో పెరుగుననెడి నిర్ధారణను ఆమె పొందెను. ఆమె ఇప్పుడు దు:ఖా క్రాంతురాలు కావలసిన పని లేదు. దేవుడు ఆమెకొక కుమారుననుగ్రహించెను. అందువలన ఎంతి సంతోషములు ఆమె హృదయ ములో ప్రవేశించెను. "నా హృదయము యెహోవాయందు సంతోషించుచున్నది. యెహోవా యందు నాకు మహాబలము కలిగెను యెహోవావంటి పరిశుద్ధ దేవుడు ఒకడు లేడు. తన భక్తుల పాదములు తొట్రిల్లకుండ ఆయన వారిని కాపాడును" అని ఆమె దేవుని స్తుతించగలిగెను (1సమూ 2:1-10).

హన్నా దేవుని సన్నిధానములో బాలుడైన సమూయేలును విడిచినను, తల్లి ప్రేమను అతనియెడల ఆమె నిత్యము నిరూపించుచునే యుండెను. ఆమె వానికి చిన్న అంగీ ఒకటి కుట్టి యేటేట బలి అర్పించుటకు తన పెనిమిటితో కూడ వచ్చినప్పుడు దాన్ని తెచ్చి వానికిచ్చుచుండెను (2:19). సమూయేలు యొక్క ఆత్మకు ఆమె భక్తి, పవిత్రతలు అను నిత్యదుస్తుల నేలాగు ధరింపజేసెనో అలాగే అతని శరీరము నకు కూడ కావలసిన దుస్తులను ఆమె అతనికి ధరింపజేసెను.

హన్నా యొక్క నిస్వార్ధ సేవ, త్యాగముల యొక్క ప్రతిఫలమే సమూయేలు యొక్క జీవితమయ్యెను. దేవుని మాటను ఎన్నడు జవదాటకుండ అతడు జీవించెను. ఇశ్రాయేలీయుల యొక్క క్షేమమును, దేవుని యందలి వారి విశ్వాసమును అతడు కోరెను.

వాటి కొరకై పాటుపడెను. సమూయేలు తన పవిత్ర జీవితము వలన ఒక గొప్ప పాఠమును మనకు నేర్పుచున్నాడు: అదేమంటే భక్తిగల జీవితమును జీవించు తల్లి యొక్క ప్రభావము తన పిల్లలలో కనబడుననునట్టిది. ఈనాడు పిల్లలు అవిధేయులుగను, స్వార్ధపరులు గను తయారగుచున్నారంటే దానికి చాలమట్టుకు వారి తలిదండ్రులే కారణము. హన్నావంటి భక్తిగల స్త్రీలు ఈనాడు ఎక్కువమంది ఉన్నయెడల సమూయేలు వంటి **పిల్లలు కూడ** ఎక్కువ మంది ఉండగలరు. అయితే సమూయేలు వంటి పిల్లలు బహు అరుదుగా యున్నారు. అంటే హన్నా లాంటి తల్లులు నేటి మన సంఘాల్లో లేరని చెప్పుకొనవలసి వచ్చుచున్నది.

సమూయేలు తన జీవితము ద్వారా వినయవిధేయతల యొక్క గొప్ప విలువను మనకు బోధించుచున్నాడు. దేవుడతని పిలువగా, నీదాసుడు ఆలకించుచున్నాడు; ప్రభువా, ఆజ్ఞ యిమ్ము అని చెప్పి అతడు బాల్యములోనే దేవుని చిత్తమునకు విధేయుడగుట నేర్చుకొనెను (3:10). యెహోవా మాటలాడగా, సమూయేలు ఆలకించెను. దేవుని మాటలకు లోబడుటయే ప్రతిమనుష్యుని యొక్క కర్తవ్యము అని అతడు మనకు బోధించెను. "యెహోవా యందు భయ భక్తులు కలిగి యుండుట తెలివికి మూలము... నా కుమారుడా, నీ తండ్రి ఉపదేశము ఆలకింపుము. నీ తల్లి చెప్పు బోధను త్రోసివేయకుము" అని అందుకే జ్ఞానియైన సొలొమోను హెచ్చరించు చున్నాడు (సామెతలు 1:7,8). వినయ విధేయతలను సమూయేలు తన తల్లి నుండి నేర్చుకొనెను. అందువలన ఇశ్రాయేలీయుల రాజైన సౌలు దేవుని మాటకు అవిధేయత చూపగా అతడు రాజైన సౌలుతో ఇట్లనెను : "ఆలోచించుము, బలులు అర్పించుట కంటె ఆజ్ఞను గైకొనుటయు, పొట్టేళ్ళ క్రొవ్వు అర్పించుటకంటె మాట వినుటయు శ్రేష్ఠము... యెహోవా ఆజ్ఞను నీవు విసర్జించితివి గనుక ఆయన నిన్ను విసర్జించెను" (1 సమూ 15:22,23).

సమూయేలు చేసిన ఆ గొప్ప హెచ్చరిక ఈనాటి ప్రజలకు మరింత అవుసరమై యున్నది. దేవునికి బలులు అర్పించుటకంటె దేవుని ఆజ్ఞను గైకొనుట, ఆయన మాటలను వినుట

ఎంతో శ్రేష్ఠము. నీవు క్రీస్తు సువార్త ఆజ్ఞలను విన్నావుగాని వాటికి లోబడితివా? సువార్తను నమ్మి ఈనాడే బాప్తిస్మము పొందుము. అవిధేయుడవై జీవించ గోరితివా, ఆయన రాజైన సౌలును తిరస్కరించినట్లు నిన్ను కూడ తిరస్కరించును.

వచ్చే సంచికలో భక్తురాలైన హన్నా జీవితము నుండి మరికొన్ని పాఠములను నేర్చుకొందాము.

- జాషువా గూటం

# నీవు ధర్మశాస్త్రమును ప్రేమించుచున్నావా?

## ( Do you Love the Law ?)

దేవుని వాక్యమును గూర్చి కీర్తనాకారుడు ఇట్లు పలికాడు. "నీ ధర్మ శాస్త్రము నాకెంతో ప్రియముగా ఉన్నది. దినమెల్ల నేను దానిని ధ్యానించుచున్నాను" (కీర్తన 119:97). కీర్తనాకారుడు దేవుని వాక్యమును ప్రేమించాడు. దినమెల్ల అతడు దానిని ధ్యానించేవాడు. దేవుని వాక్యమును పఠించి ధ్యానించుటకు వారములో ఎన్ని గంటలు నీవు వెచ్చించుదువు? నీవు దేవుని ధర్మశాస్త్రమును ప్రేమించు చున్నావా? దినమెల్లా దానిని ధ్యానించు చున్నావా?

విచారం యేమంటే ఆదివారమున ఆరాధనకు వచ్చినప్పుడు మాత్రమే అనేకులు తమ బైబిలును తెరచుదురు. గాని తమ యింటిలో ఎన్నడు బైబిలును చదువరు. అది సరిపోవునా? దేవుని వాక్యము యెడల నీకున్న యదార్థమైన ప్రేమను అది చూపించుచున్నదా? దేవుని ధర్మశాస్త్రమును ఎరుగకుండా ఎవడు దానిని ప్రేమించలేడు.

నేడు జీవించుచున్న ప్రతి వ్యక్తి దేవుని చట్టమైన క్రొత్తనిబంధనకు బద్ధుడైయున్నాడు. అంత్యదినమందు మనందరికి తీర్పుతీర్చునది అదియే (యోహాను 12:48) అయినను అనేకులు దానిని గూర్చి ఎరుగకున్నారు. వారి జీవితములో ప్రాముఖ్యమైన నిర్ణయములను క్రొత్త నిబంధనను బట్టి గైకొనరు. అందువలన వారు కాని సంగతులను ఎంచుకొంటారు. తత్ఫలితముగా వారి ఆత్మలకు నిత్యత్వములో హాని కలుగ జేసికొందురు. "నా జనులు జ్ఞానము

లేనివారై నశించుచున్నారు" అని హోషేయ పలికినమాట నేటికిని యదార్థమే (హోషేయ 4:6). నీవు దేవుని ధర్మశాస్త్రమును ప్రేమించువాడవైతే దానిని పఠించుటకు, తెలిసికొనుటకు తప్పక ప్రయత్నము చేయుదువు. దేవుని చట్టమునకు విరుద్ధముగా నడుచుకొనుచు దానిని ప్రేమించుచున్నానని ఎవడును చెప్పనేరడు. "మీరు నన్ను ప్రేమించిన యెడల నా ఆజ్ఞలను గైకొందురు" అని యేసు అందుకే చెప్పారు (యోహాను 14:15). యేసు ఆజ్ఞాపించిన వాటిని చేయకుండా ఎవడును ఆయనను ప్రేమించలేడు.

"మనమాయన ఆజ్ఞలను గైకొనుటయే దేవుని ప్రేమించుట, ఆయన ఆజ్ఞలు భారమైనవికావు" అని క్రొత్తనిబంధన చెప్పుచున్నది (1 యోహాను 5:3). దేవుని వాక్యమును ఎరిగియుండియు దానిని ఉల్లంఘించుటకు నిశ్చయించుకొనినవాడు బుద్ధిపూర్వకముగా పాపముచేయుచున్నాడు. ఏలయనగా "మనము సత్యమును గూర్చిన అనుభవజ్ఞానము పొందిన తరువాత బుద్ధిపూర్వకముగా పాపముచేసిన యెడల పాపములకు బలి యికను ఉండదుగాని, న్యాయపు తీర్పునకు భయముతో ఎదురుచూచటయు, విరోధులను దహింపబోవు తీక్షణమైన అగ్నియు ఇకను ఉండును" (హెబ్రీ 10:26,27). మనలో ప్రతివాడు దేవుని వాక్యమును గ్రహించి, విధేయులై దానిని ప్రేమించువారై యుండవలెనని మా యొక్క నిరీక్షణ. దేవుని వాక్యమును ప్రేమించుట వలన కలుగు ఆశ్చర్యమైన ఫలితములను గూర్చి కీర్తనాకారుడిట్లు వ్రాసాడు. "నీ ధర్మశాస్త్రమును ప్రేమించు వారికి ఎంతో నెమ్మది కలదు. వారు తూలి తొట్రిల్లుటకు కారణమేమియులేదు" (కీర్తన 119:165).

దేవుని వాక్యము భారమైనదని, కఠినమైనదని తలంచుటకంటే, అది మన జీవితములనెట్లు మార్చునో తలంచవలసి యున్నది. అది ఎల్లప్పుడు మనకు మేలు చేయును. దేవునితో ఇప్పుడును, నిత్యమును సమాధానము కలిగియుండుటకు దేవుని ధర్మశాస్త్రము మనకు సహాయము చేయును. "ప్రభువా నేను నీ వాక్యమును ప్రేమించు చున్నాని" నీవు చెప్పగలవా?

– జానీ హచ్చిసన్

# సంక్షిప్త వార్తలు

2018 నవంబరు 8వ తేదీనాడు రాజమండ్రి క్రీస్తు సంఘ సభ్యులు సోదరులు జి.సురేష్‌కుమార్ గారు కోరుకొండ గ్రామములో నూతనముగా నిర్మించిన గృహప్రవేశము గావించిరి. ఆ సందర్భముగా పలువురి సువార్తికుల చేతుల మీదుగా ఒక్కొక్క గది రిబ్బను కత్తిరించి ప్రార్థన పూర్వకముగా తెరువబడెను. తదుపరి అక్కడేవున్న విశాల ప్రాంగణములో ఏర్పాటు చేయబడిన కూటములో సోదరులు చుక్కా జాకబ్ (బెంగుళూరు) కె.బి.బి. చంద్రపాల్ (విజయవాడ), జాషువా గూటం గార్లు క్లుప్తముగా వాక్యోపదేశము చేసిరి. సోదరులు వి.రాజు (మద్రాసు) అధ్యక్షత వహించిరి.

2018 నవంబరు 13, 14 తేదీలలో హైదరాబాద్‌లో ఆల్ ఇండియా క్రీస్తు సంఘ సువార్తికులు సహవాస సదస్సు బాటా సింగారం గ్రామంలో యున్న ఇండియా బైబిలు అకాడమీ యొక్క ఆవరణములో సోదరులు టి.వి. సేమ్సన్‌రాజు గారి ఆధ్వర్యములో నిర్వహించబడెను. పలు పట్టణములు నుండి, పల్లెలనుండి, వివిధ రాష్ట్రముల నుండి సహోదరులు అక్కడ కూడుకొని ఎఫెసీ పత్రికలోని వివిధ అంశములను ధ్యానించుచు మంచి సహవాసములో పాల్గొనిరి.

2018 నంబరు 22, 23, 24 తేదీలలో కాకినాడ జగన్నాధపురంలో చర్చిస్క్వేర్ యున్న క్రీస్తుసంఘము గొప్ప సువార్త కూటములు నిర్వహించిరి. ప్రతిరోజు సా. 6.30 ని॥లకు ప్రారంభమైన కూటములు సోదరులు టి. జ్ఞానసుధీర్ గారి ఆధ్వర్యములో ఘనముగా నిర్వహించబడెను. స్థానిక సంఘము యొక్క విశాల ప్రాంగణములో వెయ్యిమందికి పైగా హాజరై ఆమూడు దినములు "సజీవయాగము" అను అంశముపై సువార్తికులు అందించిన ఆత్మీయహారమును ఆస్వాదించిరి.

ఆ కూటములలో సోదరులు కె.జి. కుమార్, పి.ఎస్.ఆర్. జయపాల్, రిక్కీగూటం, జాషువా గూటం, బి. జాన్‌రత్నం (రంపచోడవరం), యమ్. జాన్‌డీన్, నెహెమ్యాగూటం గార్లును తదితరులను గొప్ప వాక్యసందేశములను అందించిరి. హాజరైన వారందరికీ స్థానిక సంఘము ప్రతిరాత్రి విందునేర్పాటు

చేసిరి. కాకినాడ జగన్నాథపురం చర్చిస్క్వేర్‌లోను, పరిసర ప్రాంతములలోను సోదరులు టి. జ్ఞానసుధీర్ గారు గొప్ప పరిచర్య చేయుచున్నారు.

రాబిన్, రేచల్ గూటం దంపతులు తమ కుమారుడు రాయన్ గారితో కలసి ఈ నెల 27న అమెరికాలో బయలుదేరి 29వ తేదీనాటికి కాకినాడ చేరుకొందురు.

2018 డిశంబరు 2 నుండి 6 వరకు కాకినాడ సత్యవాణి ప్రాంగణలో జరుగు పాలిషింగ్ ద పుల్ పిట్ బైబిలు లెక్చరర్‌షిప్ కొరకు అన్ని ఏర్పాట్లు జరుగుచున్నవి. ఆయాపరిచర్యల కొరకు ప్రార్థించమనవి.

2019 జనవరి నెలలో **బాలల నుండి పాకులయ్యే వరకు** అను గొప్ప కార్యక్రమము సంకల్పించబడినది. దానిలో బాలలు, యౌవనస్థులు పాల్గొనవచ్చును. మంచి క్రైస్తవ నాయకత్వమును గూర్చి హాజరైన వారికి తర్ఫీతు ఇయ్యబడును.

**RNI Regd. No. 69973/98**

**Postal Regd.No. AP/KD-02/2018-20**

**From :**

**SATYAVAKKU**

**P.O. Box 80, Kakinada - 533 001**

Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication, Sambamurthy St., Kakinada - 533 004.